క్లుప్తంగా

నర్సింహారెడ్డికి సన్మానం



నర్సింహారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కందుకూరు: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నాలుగోసారి బాధ్యతలు చేపట్టిన నర్సింహారెడ్డిని బుధవారం మండలానికి చెందిన బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలువాల శేఖర్ ఆధ్వర్యంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దళితమోర్చా జిల్లా కార్యవర్గసభ్యుడు రాములు, పులిమామిడి బూత్ అధ్యక్షుడు అంజయ్య, గణేశ్, రమేశ్, సురేశ్, భిక్షపతి, రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు వినతి



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న జంగారెడ్డి

కందుకూరు: పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి మంగళవారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. రాష్ట్ర స్థాయిలోని ఏదైనా చైర్మన్ పోస్టును తనకు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సీఎంను కలిసిన వారిలో పలువురు కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

సీఐకి శుభాకాంక్షలు



సీఐకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉపేందర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: చైతన్యపురి పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును బుధవారం రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఐ నాగరాజు, సురేశ్, శ్రీనివాస్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, ఇస్మాయిల్, మాచర్ల వరుణ్, కాళిదాసు, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించాలి

తుర్కయంజాల్: ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు, వ్యాపార లైసెన్స్‌లను తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం ఆయన క్షేత్ర పరిశీలనలో భాగంగా పలు వార్డుల్లో పర్యటించి పన్ను వసూల్ల తీరును పరిశీలించారు. పన్నులను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ముందస్తుగా పన్నులు చెల్లిస్తున్న పలువురిని కమిషనర్ అభినందించారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



ప్రహరీ పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ శంకర్

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి సర్పంచ్ శంకర్ స్థానిక నాయకులతో కలిసి బుధవారం భూమిపూజ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ఇటీవలే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించడం జరిగిందని.. పంచాయతీ కార్యాలయానికి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరగా.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రూ.15 లక్షలు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు.ఈ మేరకు బుధవారం ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు జగన్‌గౌడ్, కేశవులు, శ్రీరాములు, భరత్, రామకృష్ణ, జాన్యా, నర్సింహ, వెంకటేశ్, రాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించండి

తుర్కయంజాల్: రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ పురపాలక సంఘం పరిధి ఉమర్‌ఖాన్ గూడ కౌన్సిలర్ కరాడి శ్రీలత బుధవారం జిల్లా రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రావణ్ ప్రకాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కోహెడ నుంచి సంఘీ నగర్‌కు వెళ్లే రోడ్డులో అనేక మలుపులు ఉండటంతో నిత్యం అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రమాదాల నివారణ కొరకు స్పీడ్ బ్రేకర్లతో పాటు జిగ్‌జాగ్ క్రాసింగ్ లేన్ల ఏర్పాటు, వీధి దీపాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆమె కోరారు.

అన్నీ లుకలుకలే..!



బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ భవనం

- ఆర్భాటంగా కొత్త కార్పొరేషన్ భవనం ప్రారంభోత్సవం
- ఎక్కడ ఏ సెక్షన్ ఉండాలో నిర్ణయించని కమిషనర్
- చాంబర్లను డిసైడ్ చేసుకున్న అధికారులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో వింత పరిస్థితి నెలకొంది. బడంగ్‌పేట గ్రామ పంచాయతీగా ఉన్న చివరి రోజుల్లో కొత్త పంచాయతీ భవనాన్ని నిర్మించారు. ఆ తర్వాత బడంగ్‌పేట గ్రామ పంచాయితీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కార్పొరేషన్‌గా మారిన తర్వాత కూడా అక్కడే పాలన కొనసాగించారు. ఆ తర్వాత కొత్త భవనాన్ని నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. అనుకున్నట్లే దావుత్‌ఖాన్ గూడలో భవన నిర్మాణాన్ని చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకుని కొత్త మున్సిపల్ భవనం పూర్తి కాకముందే ప్రారంభించారు.

హడావిడిగా తరలింపు

రెండు రోజుల క్రితం కొత్త భవనంలోకి పాలనను షిఫ్ట్ చేశారు. అయితే కమిషనర్ అనుమతి లేకుండా ఎవరికి వారే నిర్ణయం తీసుకుని చాంబర్‌లలో తిష్టవేసిపాలనను కొనసాగించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. మేయర్, డిప్యూటీ మేయర్ చాంబర్‌ను మెయిన్ డోర్‌కు ఎదురుగా ఏర్పాటు చేశారు. రెండో అంతస్తుతో ఎమ్మెల్యే చాంబర్‌ను ఏర్పాటు చేశారు. ప్రజలు సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ఒక్క గదిని కూడా వదలిపెట్టకుండా ఎవరికి వారే రూములు కేటాయించుకోవడం వివాదాస్పదంగా మారింది. శానిటేషన్ విధులకు సంబంధించి బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు అనేక అవార్డులు వచ్చాయి. ఈ విభాగానికి రెండో అంతస్తులో ఎక్కడ స్థలం కేటాయించక పోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వెళ్లే ప్రధాన రహదారిలో కొత్త మున్సిపల్ కార్పొరేషన్‌ను నిర్మించారు. రహదారి కంటే ఆరు అడుగుల కిందకు భవనాన్ని నిర్మించారు. రోడ్డుకు కింది భాగంలో ఉండడంతో వర్షం వస్తే మునిగిపోయే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. కొత్త భవనాన్ని ఓ ప్లాన్ లేకుండా నిర్మించారని స్థానికులు విమర్శిస్తున్నారు.

పశు వైద్యశాల తనిఖీ



వైద్యులతో మాట్లాడుతున్న ఏడీ కృష్ణయ్య

కందుకూరు: కందుకూరు ప్రాథమిక పశువైద్య కేంద్రాన్ని బుధవారం పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) డాక్టర్ కృష్ణయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ రేవతి, రాచులూరు, లేమూరు పశు వైద్యులు డాక్టర్ షాహిన్‌షేక్, డాక్టర్ సంధ్యారాణి సిబ్బంది వసంత, సామయ్య, జంగయ్య, రమేశ్, మాధవి, కదీర్, అప్సర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

జంతువుల సంరక్షణ అందరి బాధ్యత

జంతువుల సంరక్షణ అందరి బాధ్యత అని మండల పశువైద్యాధికారి డాక్టర్ రేవతి అన్నారు. బుధవారం కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో జంతు సంక్షేమం, పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జంతు హింస నివారణ సంఘం చైర్మన్‌గా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా ఎస్పీ, సెక్రటరీగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వ్యవహరిస్తారన్నారు. జంతువుల సంక్షేమం కోసం ప్రభుత్వం జంతు హింస నివారణ చట్టాన్ని తెచ్చిందని, ఈ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జంతువులను, పక్షులను హింసిస్తే జంతు సంక్షేమబోర్డు శిక్షిస్తుందని హెచ్చరించారు. జంతువుల పట్ల కరుణ, దయ చూపుతూ ఆహారం, నీరు అందించాలని సూచించారు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా రోగ నిరోధక టీకాలు వేయించాలని పేర్కొన్నారు. వీధి కుక్కలను చంపడం, వేరే ప్రాంతాలకు తరలించడం, హింసించడం చట్టరీత్యా నేరమని తెలపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్‌చారి, పశు వైద్యులు డాక్టర్ షాహిన్‌షైక్, డాక్టర్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రౌడీయిజాన్ని అణచివేస్తాం

మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ సునీతారెడ్డి

పహాడీషరీఫ్: గుండాయిజాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తామని మహేశ్వరం జోన్ డీసీపీ డి.సునీతారెడ్డి రౌడీషీటర్లను హెచ్చరించారు. మంగళవారం రాత్రి ఆమె బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ప్రతీ రౌడీషీటర్ కదలికలపై పోలీస్ నిఘా ఉంటుందన్నారు. పనిచేసే ప్రదేశాల్లోనూ వ్యవహార శైలిని గుర్తిస్తున్నామన్నారు. అమాయకులను బెదిరించడం, దాడులు చేయడం, భూవివాదాల్లో తలదూర్చినట్లయితే కఠినంగా శిక్షలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ తమ ప్రవర్తనను మార్చుకోవాలని సూచించారు. సత్ప్రవర్తన కలిగిన రౌడీషీటర్ల విషయంలో షీట్లు తొలగిస్తామని తెలిపారు. బాలాపూర్‌లో రౌడీషీటర్లు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారని, ఇకపై వారిపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఏసీపీ శ్రీనివాస్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంతో కొట్లాడైనా నిధులు తెస్తా

- బీఆర్‌ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి
- ఇంటింటికీ తాగునీరు
- విద్యారంగానికి పెద్దపీట
- ఎమ్మెల్యే సబితారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

మహేశ్వరం: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి కోసం తీసుకొచ్చిన రూ.170 కోట్ల నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిలిపివేసిందని ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. ప్రభుత్వంతో కొట్లాడైనా నిధులు తెస్తానని స్పష్టంచేశారు. బుధవారం మండల పరిధిలోని కేసీ తండాల్లో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను ఆమె స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో కుల సంఘాల భవనాల నిర్మాణానికి రూ.10 కోట్ల నిధులు కేటాయించామని.. రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను కూడా రద్దు చేసిందని తెలిపారు. తాను నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేశానని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పల్లె ప్రగతి ద్వారా గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రకటించారు. సర్పంచ్‌లు ఐదేళ్ల పాటు అనేక సమస్యలు ఎదుర్కొని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ సునీత, గ్రామ సర్పంచ్ మోతిలాల్‌నాయక్, ఉప సర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, వార్డు సభ్యులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే భరించలేకపోతున్నారు

కందుకూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. గ్రామాల్లో పర్యటిస్తే తాము చేసిన అభివృద్ధి కనిపిస్తుందని, గత ప్రభుత్వ పాలనను విమర్శించే వారికి అదే సమాధానమన్నారు. బుధవారం మండల పరిధిలోని మాదాపూర్, గూడూరు గ్రామాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి సబితారెడ్డి రూ.2.66 కోట్ల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో సర్పంచులు, పాలకవర్గం పల్లె ప్రగతి పనులను బాగా కష్టపడి చేశారని కొనియాడారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి సాధించాయని తెలిపారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీరు, మన ఊరు మన బడి పథకం కింద పాఠశాలల అభివృద్ధితో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే భరించలేకపోతున్నారని చెప్పారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచులు మంద సాయిలు, శ్రీలత, స్థానిక ఎంపీటీసీ ఎల్లారెడ్డి, ఎంపీపీ జ్యోతిపాండు, జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి, సర్పంచ్ గోవర్ధన్, ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్, మహిళా అధ్యక్షురాలు ఇందిర, సీనియర్ నాయకులు దశరథ, బాబయ్య, పారిజాతం, రాంరెడ్డి, లచ్చానాయక్, మేఘనాథ్‌రెడ్డి, అంజయ్య, మహేందర్‌రెడ్డి, ఆనంద్, కృష్ణారెడ్డి, దేవేందర్, దామోదర్‌గౌడ్, పాండుగౌడ్, రామకృష్ణ, మస్కు బాబు, దీక్షిత్‌రెడ్డి, కార్తీక్, సామయ్య, ప్రశాంత్, శ్రీధర్, దార జంగయ్య, వెంకటేశ్, అలీ, నవీన్, పాపిరెడి పాల్గొన్నారు.

ఘనంగా గద్దర్ జయంతి

ఇబ్రహీంపట్నం: యూత్ కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో బుధవారం ప్రజాయుద్ధనౌక, దివంగత గాయకుడు గద్దర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు కొంకణి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంకాల కరుణాకర్, రాజు, మహేష్ మహరాజ్, పగడాల నగేష్, శ్యామ్, ఇమ్రాన్, కిరణ్, అమరేందర్, సల్మాన్, సోహెల్, అయాన్, సాయి పాల్గొన్నారు. గద్దర్ ఆశయసాధనకు కృషి చేస్తామన్నారు.



భారతి సిమెంట్‌కు తిరుగులేదు



మేస్త్రీలకు బహుమతులు అందజేస్తున్న భారతి సిమెంట్ నిర్వాహకులు

బడంగ్‌పేట్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్‌సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్ ను తెలంగాణలో విడుదల చేసినట్లు ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ మహమ్మద్ సాహేర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లోని శ్రీనివాస డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ సాహేర్ మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతుందని తెలిపారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జీలు, రహదారులకు సరైన ఎంపిక భారతి సిమెంట్ అని అన్నారు. వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని తెలిపారు. అనంతరం మేస్త్రీలకు పలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీలర్ కోటేశ్వర్‌రావు, టెక్నికల్ మార్కెటింగ్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ బద్రి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



ఎల్‌బీనగర్ లేబర్ అడ్డా వద్ద సంతకాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

హస్తినాపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని ఎల్‌బీనగర్ సర్కిల్ సీఐటీయూ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అన్నారు. వచ్చే ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సాగర్‌రింగ్ రోడ్డులో మార్బుల్ హమాలీ కార్మికులతో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ, ఫిబ్రవరి 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో మార్బుల్ హమాలీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు పూర్తైనా రైతాంగ కార్మికవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించలేదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని ఎల్లయ్య అన్నారు. కార్యక్రమంలో లాట్ల లక్ష్మన్, హమాలీ కార్మికులు ఎం.రాంచంద్ర యాదగిరి, కె. కృష్ణయ్య, కుమార్‌యాదవ్, బీరయ్య, కృష్ణ, ఎం.శ్రీను , వి.యాదయ్య, రాజు, శ్రీను కానుగుల, వెంకటేశ్, వేముల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

లింగోజిగూడ: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఫిబ్రవరి 16న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ కోరారు.సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం ఎల్‌బీనగర్ లేబర్ అడ్డా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. చంద్రమోహన్ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నాయకులు లక్ష్మణ్, నరసింహ, రాజు, చెన్నయ్య, బాలరాజు, సాలమ్మ, అలివేలు, లక్ష్మమ్మ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు సర్పంచ్‌లే వెన్నెముక



సర్పంచ్‌లను సన్మానించిన నర్మద, నాయకులు

తలకొండపల్లి: గ్రామాలాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని మాజీ ఎంపీటీసీ యాదయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని చుక్కాపూర్‌లో సర్పంచ్ దాసరి కిష్టమ్మ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాలకు సర్పంచ్‌లు వెన్నుముఖ వంటివారని పేర్కొన్నారు. ప్రజల బాగోగులు చూడటంతో పాటు గ్రామాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తారని అన్నారు. అనంతరం సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాలకు సర్పంచ్ కిష్టయ్య, మాజీ ఎంపీటీసీ యాదయ్య, మాజీ సర్పంచ్ పట్టాభిరామశర్మ, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీపీ నర్మద ఆధ్వర్యంలో..

మంచాల: మంచాల మండల కార్యాలయంలో సర్పంచ్‌లను బుధవారం ఎంపీపీ నర్మద ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నర్మద మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాలుగా సర్పంచ్‌లు గ్రామాల్లో ప్రజలకు సేవలు అందించడం జరిగిందన్నారు. వారి పదవీకాలం ముగియనుండడంతో వారి సేవలను గుర్తించి సన్మానించడంతో పాటు జ్ఞాపికలను అందజేసినట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా పంచాయతీ రాజ్ శాఖ డీఈఈగా పదోన్నతి పొందిన అబ్బాస్‌ను కూడా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మర్రినిత్య రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ వెంకట ప్రసాద్, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు అధికారులు పాల్గొన్నారు.

వార్డు సభ్యులకు సన్మానం

అబ్దుల్లాపూర్‌మెట్: గ్రామ పంచాయతీ పాలకవర్గం ఐదేళ్లు పూర్తికావడంతో పాటు తమ పదవీ కాలం ముగిసిన సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు బుధవారం ఆత్మీయ వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఐదు సంవత్సరాల పాటు కలిసికట్టుగా గ్రామాభివృద్ధిలో పాలుపంచుకోవడం గర్వంగా ఉందని వార్డుసభ్యులు పేర్కొన్నారు.

వినియోగంలోకి తీసుకురండి



ఎస్సీ కమ్యూనిటీ దుకాణ సముదాయం

- యాచారంలో నిరుపయోగంగా ఎస్సీ కమ్యూనిటీ దుకాణ సముదాయం
- నిరుద్యోగులకు కేటాయించాలని వినతి

యాచారం: నిరుపయోగంగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీ సహకార దుకాణ సముదాయ భవనాన్ని వాడుకలోకి తీసుకురావాలని ఆ వర్గం ప్రజలు కోరుతున్నారు. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం మండల కేంద్రంలో గత 25 ఏళ్ల కింద ఎస్సీ సామాజికవర్గం వారు ఎవైనా వ్యాపారాలు చేసుకునేందుకు రూ.రెండున్నర లక్షలు ఖర్చు చేసి భవనాన్ని నిర్మించి ఐదు దుకాణాలు ఏర్పాటు చేశారు. ఎస్సీ సామాజిక వర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ భవనంలో ఎదైనా వ్యాపారం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలన్నదే సర్కార్ లక్ష్యం. అంతవరకు భాగానే ఉన్నా నేడు ఆ దుకాణాలు పూర్తిగా నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. సాగర్ హైవేపై ఈ స్థలం ధర ప్రస్తుతం రూ.కోటికి పైగా డిమాండ్ ఉంటుంది. ఎస్సీ సామాజిక వర్గం వారు ఆ దుకాణాలు లీజుకైనా ఇవ్వాలని పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను అడిగినా స్పందన లేకపోవడంతో ఊరుకున్నారు. ఈ దుకాణాలున్న భవనం పక్కనే యాచారం పీఏసీఎస్ భవనం, ప్రభుత్వాస్పత్రి, విద్యుత్ కార్యాలయాలు ఉన్నాయి. ఎవైనా దుకాణాలు పెట్టుకుంటే నిరుద్యోగ యువత ఆర్థిక ప్రగతి సాధించే అవకాశం ఉంటుంది. ఇదే విషయమై ఎంపీడీఓ విజయలక్ష్మిని సంప్రదించగా యువత అర్జీలు పెట్టుకుంటే, ఉన్నతాధికారుల అనుమతులు తీసుకుని లీజుకు ఇస్తామని తెలిపారు.

తలకొండపల్లి ఎస్‌ఐగా శ్రీకాంత్

తలకొండపల్లి: తలకొండపల్లి మండల నూతన ఎస్‌ఐగా ఎ.శ్రీకాంత్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. తలకొండపల్లి మండల పోలీస్ ఠాణాలో ఎస్‌ఐగా విధులు నిర్వహించిన శ్రీను హైదరాబాద్ అత్తాపూర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్ జగద్గిరిగుట్టలో సెక్టార్–3 ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహించిన శ్రీకాంత్ తలకొండపల్లి మండలానికి బదిలీపై వచ్చి బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..

ఔదార్యం చాటుకున్న మిత్రులు

తలకొండపల్లి: మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి అతడి స్నేహితులు ఔదార్యం చాటారు. మేమున్నామంటూ ముందుకు వచ్చి చేయూతనందించారు. రూ.లక్షా పదివే ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు. వివరాలు.. మండల పరిధిలోని చౌదర్‌పల్లికి చెందిన మల్లేష్‌గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుటుంబ పెద్ద అకస్మాత్తుగా మరణించడంతో ఆ కుటుంబం ఆర్థికంగా దెబ్బతిని వీధిన పడే పరిస్థితి దాపురించింది. మృతి చెందిన మల్లేష్‌గౌడ్‌తో 1998–99 ఏడాదిలో పదోతరగతి చదివిన మిత్రులు ఆ కుటుంబానికి ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. బుధవారం మల్లేష్‌గౌడ్ పిల్లల చదువుకోసం రూ.లక్షా పదివేలను ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే వెల్జాల్‌లో రాచమల్ల భాస్కర్ తల్లి మృతిచెందడంతో రూ.పదివేల ఆర్థికసహాయం అందజేసి ఔదార్యం చాటుకున్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకున్న మిత్రులను పలువురు ప్రశంసించారు.